# ఛోటా లీడర్

'ఏమేవ్! రేపే ప్రయాణం. సిద్ధం కావాలి.'

'ఎక్కడికండీ?'

'మీ పుట్టింటికి'

'ఎందుకూ?'

'ఎందుకేవిఁటీ? ఏడో నెల వచ్చిందన్నావుగా, నిన్ను దిగబెట్టి వస్తాను.'

'అయితే_ ఈ తడవకూడా పుట్టింటికే పంపిస్తారన్న మాట.'

'ఏం చేస్తాం మరి?'

'ఊఁహుఁ! నేను వెళ్ళనండీ.'

'అదేమిటి, అలా కొత్తగా మాట్లాడతావు? ఇక్కడెలా జరుగుతుంది చెప్పు.'

'అంత జరపలేనివారు పెళ్ళెందుకు చేసుకోవాలీ...?'

'మళ్ళీ మొదటి కొచ్చావూ?...'

'మొదలూ లేదు, ఆఖరూ లేదు. మీకేం తెలుసు నాకక్కడెంత నామోషీగా వుంటుందో, మావొదినా వాళ్ళ ఎత్తిపొడుపు మాటలు చెవిని పడుతూంటే గుండెలు తూట్లు పడుతుంటాయి...'

'ఏం చేస్తాం? అంత మాత్రం వోర్చుకోలేక పోతే ఎలా? నన్ను చూడరాదూ, రాత్రనకా పగలనకా ఎలా తిరుగుతున్నానో?

'ఎందుకొచ్చిన కర్మండీ యిదీ? ఏ వుద్యోగమో, సద్యోగమో చేసుకుంటే హాయిగా బతకొచ్చుగా?'

'అబ్బ! నీకు అర్థం కాదులేవే.'

'మీకు అర్థమైన మాత్రం ఏం వొరుగుతూందండీ? పదేళ్ళబట్టి తిరుగుతున్నారుగా ఈ రాజకీయాల్లో - వెధవ రాజకీయాలు! తిండికీ, గుడ్డకే మొహం వాచిపోతోంది... ఇంతకూ మీలో వుండాలి లెండి. ఆ కాపమ్మ మొగుణ్ణి చూడరాదూ, రెండేళ్ళ క్రితం వూరూ పేరూ లేనివాడు యిప్పుడు అమాంతం మంత్రయి కూచున్నాడు. వాళ్ళ దర్జా చూడండి_ కారూ, బంగళా...'

'పోన్లే, నీ నొసట కూడా మంత్రి భార్య అయ్యే రాత రాసివుంటే నేనూ కాకపోతానాయేం?'

'ఆ అయినట్టే! ఆఖరికి ముష్టి మునిసిపల్ మెంబరు కూడా కాకపోతిరి...'

'నేను గాంధీవాదిని తెలుసా? పదవులపైన వ్యామోహంలేదు నాకు'

'మహా గొప్పవాళ్ళు!... మరి భార్యా పిల్లలెందుకూ?'

'అబ్బ! నీతో తర్కించలేనే. ఇంతకూ వెళ్తానంటావా? లేదా?'

'ఉహూఁ! నేను వెళ్ళనండి.'

'మరీ...?'

'మరేమీ లేదు. ఇక్కడేదో కస్తూరిబాయి అనాథ అసుపత్రి వుందటగా, అందులో పడేయండి తీరిపోతుంది.'

మాట్లాడకుండా జారుకున్నాడు ఛోటాలీడర్.